## కరెంటుకు చాలా ప్రాధాన్యత ఉంది



తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటుతో చాలా ప్రాధాన్యత ఉంది. వ్యవసాయ పంటలకు నీరు సరఫరా చేస్తూ పంటలు పండించు కుంటున్నాం. తెలంగాణ రాష్ట్రానికే కాక దేశానికి కూడా అన్నపూర్ణగా ఆవిర్భవించింది. రాత్రి, పగలు వెలుగులు నిండుతున్నాయి. రాత్రి కూడా నిరంతరం కరెంటు సరఫరాతో సంతోషంగా ఉన్నాం. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమ వర్గాలు జీవనోపాధిని కల్పిస్తూ ముందుకెళ్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇవన్నీ పోతాయి. బీఆర్ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దాం.

**– నాగరాజు, కొల్లాపురం, సుదిమళ్ల పంచాయతీ, ఇల్లెందు మండలం**

## జనరేటర్ జాడే లేదు..



ఒకప్పుడు కరెంటు లేక అనేక పరిశ్రమలు, ఆస్పత్రులు జనరేటర్‌ను వాడుకుంటూ రోగులు, కొనుగోలుదారులపై అధిక భారం వేస్తూ సంపాదించుకునేవారు. గత పాలకుల హయాంలో డీజిల్, పెట్రోల్ రేట్లు బాగా పెరిగిపోయేవి. కానీ నేడు 24 గంటల కరెంట్‌లో జనరేటర్ జాడే లేకుండా పోయింది. నిరంతర విద్యుత్‌తో డీజిల్, పెట్రోల్ బాధలు తప్పాయి. కరెంటు పోతే పేదోళ్లు కటిక చీకట్లో మగ్గేవారు. నేడు ధనిక, పేద తేడా పోయింది. అందరి ఇంట్లో కరెంటు ఉంది. ఇదంతా కేవలం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైంది. అందుకే మళ్లీ సారే సీఎం కావాలి

**– దారావత్ దేవా, పోలారం పంచాయతీ, ఇల్లెందు మండలం**

## కేసీఆర్ పాలన బాగుంది



సీఎం కేసీఆర్ పరిపాలన చాలా బాగుంది. సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయి. ధరణి అంటే రైతులకు లాభం. ధరణి వల్ల నా భూమికి భద్రత పెరిగింది. రైతుబంధు అందుతున్నది. కాంగ్రెస్ వస్తే రైతు రోడ్డు పాలవుతాడు. అందుకే నా ఓటు కారు గుర్తుపై వేస్తాను. తెల్లం వెంకట్రావును గెలిపిస్తాం. **– వేముల రామకృష్ణ, రైతు, కేశవపట్నం**

## మాకు ధరణే ఉండాలి



ధరణి బాగుంది. కాంగ్రెసోళ్లు చెప్పిన మాటలు విని మేం మోసపోం. మాకు ధరణి కావాలి. ధరణి పోర్టల్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. భూములను దళారుల ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ నిమిషాల్లో పూర్తవుతున్నది. వెంటనే భూమి పాస్ బుక్‌లోకి వస్తుంది. గతంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ తిరిగి నానా ఇబ్బందులు పడేవాళ్లం ప్రస్తుతం ఆ బాధలు లేవు. ధరణి రాకతో రైతుల పనులు త్వరగా పూర్తవుతున్నాయి. దళారుల బెడద తగ్గింది.

**– ముగితే శంకర్, పెనగడప, చుంచుపల్లి మండలం**

## కాంగ్రెస్‌సోళ్లను నమ్మవద్దు..



కాంగ్రెసోళ్ల మాటలు నమ్మవద్దు వారికి ఓటేస్తే ధరణి రద్దు చేస్తామంటున్నారు. ఇట్లా అయితే తిప్పలు పడాల్సి వస్తుంది. ధరణితో భూమి సమస్యలు లేకుండా పోయాయి. కాంగ్రెస్ వచ్చేది లేదు. సచ్చేది లేదు. ప్రజలు కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మడంలేదు. వీరు అధికారంలోకి రాకుముందు మస్తు చెప్తరు. అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయరు. సీఎం కేసీఆర్ తెలంగాణకు శ్రీరామరక్ష. రైతులమంతా కారుకు ఓటేసి ధరణిని కాపాడుకుంటాం. దళారీలను రానివ్వం.

**– కట్ల కృష్ణయ్య, రైతు, పెనగడప, చుంచుపల్లి**

## కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కటకటే



పదేళ్ల క్రితం కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలను కండ్లారా చూసాం. మళ్లీ వాళ్లు వస్తే మూడు గంటల కరెంటు కూడా సరిగా ఇవ్వరు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఎన్నో బాధలు పడ్డారు. రైతుల ఇబ్బందులు పట్టించుకోని వాళ్లు ఎన్నికల్లో గెలవాలనే ఆశతో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 24 గంటల కరెంటు ఇస్తున్న కేసీఆర్‌కే మా మద్దతు. కాంగ్రెసోళ్లను నెత్తినపెట్టుకొని కరెంట్ కష్టాలు మళ్లీ పడలేము.

**– యదళ్లపల్లి వీరభద్రం, రైతు, అనంతారం, జూలూరుపాడు**

## రైతులు బాగుండాలంటే కేసీఆర్ ఉండాలి



రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం కేసీఆర్. రైతులకు ఏం చేస్తే బాగుంటుంది, మంచి జరుగుతుందో ఆయనకు తెలుసు. రైతుల కోసం 24 గంటల కరెంటు ఇచ్చాడు. పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. కష్టాల ఊబి నుంచి బయటికి వచ్చిన రైతును కాంగ్రెస్ వాళ్లు వచ్చి మళ్లీ కష్టాలపాలు చేసేందుకు చూస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎప్పుడు వస్తుందో... పోతుందో తెలియదు. వ్యవసాయానికి మూడుగంటల కరెంటు సరిపోదు. కేసీఆర్ అందిస్తున్న నాణ్యమైన 24 గంటలు కావాలి. కేసీఆర్‌ను గెలిపించుకుంటేనే రైతులకు కష్టాలు రావు. కాంగ్రెస్ వస్తే రైతులకు చీకటిరోజులు ఖాయం.

**– రామకృష్ణ, రైతు, రేగుబల్లి, దుమ్ముగూడెం**

## ధరణి ఉంటేనే మంచిది



రైతుల కోసమే ధరణిని కేసీఆర్ తీసుకొచ్చిండు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తొలగిస్తామనడం మంచిది కాదు. గతంలో రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగేది. పహాణి నకలు సైతం ఇచ్చేవారు కాదు. ఇప్పుడు పట్టాదారు పాసు పుస్తకం ఇచ్చారు. ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు ఉంటున్నాయి. రైతులు వచ్చి వేలి ముద్ర పెడితేనే భూమార్పిడి జరుగుతది. అధికారుల ప్రమేయం లేదు. కష్టాలు పోయి సుఖాలు వచ్చినాయి. కాంగ్రెస్ వస్తే మళ్లీ కష్టాలు మొదలౌతాయి.

**– బోడా రాజు, రైతు, రావికంపాడు గ్రామం, చంద్రుగొండ మండలం**

## రైతులు బజారున పడతారు..



తెలంగాణ రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ రైతులకు చానా మేలు చేశారు. ముఖ్యంగా 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పంటలు బాగా పండుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే మూడుగంటల విద్యుత్ అంటున్నారు. రైతులు మళ్లీ బజారున పడతారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలి, కారు గుర్తుకే ఓటేస్తాం, భద్రాచలం ఎమ్మెల్యేగా టీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావును గెలిపించుకుంటాం.

**– పసుపులేటి వెంకటయ్య, రైతు, సున్నంబట్టి, దుమ్ముగూడెం**

# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





- మూడు గంటల కరెంటు మాటే వద్దు..
- 10 హెచ్‌పీ మోటర్లు పిచ్చి ఆలోచన
- కాంగ్రెస్ పాలనలో పొలాల వద్ద నరకం చూశాం
- ఎండిపోయిన పంటలతో తీవ్రంగా నష్టపోయాం..
- చీకటిరోజులను మర్చిపోలేమంటున్న రైతన్నలు
- బీఆర్ఎస్ పాలనలో సమృద్ధిగా రెండు పంటలు
- నిరంతరాయంగా 24 గంటల ఉచిత విద్యుత్
- రైతు ప్రభుత్వం బీఆర్ఎస్‌కే అన్నదాతల పూర్తి మద్దతు

## కర్షక వ్యతిరేకి

# కాంగ్రెస్‌ను తరుముడే..

బీఆర్ఎస్ ప్రభుత్వం అడగకుండానే రైతుల తీరొక్క అవసరాలు తీరుస్తోంది. ఏళ్లనాటి కష్టాలను కళ్లారా చూసిన సీఎం కేసీఆర్ సాగు రైతులు బాగుపడేలా.. కరెంటు, నీటి సమస్యలు లేకుండా రెండు పంటలు పండించుకునేలా చేశారు. ఎన్నికలు రాగానే సాగుపై అవగాహన, భూముల విలువ తెలియని కాంగ్రెస్ నాయకుల కండ్లు మండుతున్నాయి. రైతులు బాగుపడొద్దనే ఉద్దేశంతో అధికారంలోకి వస్తే మళ్లీ పాత విధానాలే తీసుకొస్తామని చెబుతున్నారు. పంట పండించుకోవాలంటే 3 గంటల కరెంటు సరిపోతుందని, 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలని చెప్పడంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. ధరణి పోర్టల్‌ను తీసివేసి భూమాత పోర్టల్ పెడతామని, పటేల్, పట్వారీ వ్యవస్థను మళ్లీ తీసుకొస్తామని కుట్ర పన్నడంపై మండిపడుతున్నారు. పాడిపంటలతో మా జీవితాలు సజావుగా సాగుతున్నాయని, ముఖ్యమంత్రి కేసీఆర్‌కే మా మద్దతు అని రైతులు చెబుతున్నారు. కాంగ్రెసోళ్లను దరిదాపుల్లోకి రానివ్వమని అంటున్నారు.

*-భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ )*

## కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలే



తెలంగాణ రాక మునుపు కరెంట్ వచ్చిన నాడే పొలానికి నీరు పెట్టాలె. ఒక్క రోజు రాకపోయినా.. పొలం ఎండిపోయేది. తెలంగాణ వచ్చినంక 24 గంటల కరెంట్ వస్తున్నది. పొలాలకు తడి అవసరమైనప్పుడే మోటర్ ఆన్ చేసి నీళ్లు ఇస్తున్నం. పొలానికి మూడు గంటల కరెంట్ చాలని రేవంత్ రెడ్డి అంటున్నడంటే.. ఆయనకు వ్యవసాయం తెలియదని అర్థమవుతున్నది. అలాంటి వారిని గెలిపిస్తే తెలంగాణ ఇంకా ఆగమైతది. మళ్లీ కేసీఆర్ సారే రావాలి. అందరూ కారు గుర్తుకే ఓటు వేయాలి. **– బోయిళ్ల రమణయ్య, రామానుజవరం, మణుగూరు**

## ధరణితో రైతులకు మేలు



ధరణి వచ్చిన తర్వాతే మా భూమి మాకు ఉంది. గతంలో అన్నదమ్ముళ్ల పంచాయితీలో అక్కడో ముక్క.. ఇక్కడో ముక్క ఉండేది. ఇప్పుడు పక్కా లెక్కలు ధరణిలోకి ఎక్కాయి. మాకు చింత తీరింది. వీఆర్వోల చుట్టూ తిరగలేక.. వాళ్లు అడిగిన లంచాలు ఇవ్వలేక.. మా ఊరిలో చానామంది ఇబ్బంది పడ్డారు. సీఎం కేసీఆర్ ధరణి తెచ్చిన తర్వాత, మా పొలాలు మాకు కంప్యూటరైజ్డ్ అయ్యాయి. అలాంటి ధరణిని తీసేస్తానంటున్న కాంగ్రెస్ పార్టీ ఎలా గెలుస్తుంది? ధరణి కావాలి, కేసీఆర్ సీఎం కావాలి. కారు గుర్తుకే మా ఓటు.

**– మండారి సతీష్, కొండాయిగూడెం, మణుగూరు**

## వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్



కేసీఆర్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రైతులకు 24 గంటలపాటు త్రీఫేజ్ కరెంటు ఉచితంగా ఇస్తున్నాడు. రైతులు రెండు పంటలు పుష్కలంగా పండిస్తున్నారు. కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంటు ఇస్తామంటున్నారు. ఇలా అయితే.. రెండు పంటలు కూడా ఎండిపోతాయి. రైతులకు తీవ్ర నష్టం జరుగుతది. గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంటు సక్రమంగా ఉండేది కాదు. తొమ్మిది గంటలపాటు అని చెప్పి, రెండు మూడు గంటలు మాత్రమే ఇచ్చేవారు. మాకు సీఎంగా కేసీఆర్ సార్ రావాలి.

**– భూపతి శ్రీనివాసరావు, రైతు, రావికంపాడు గ్రామం, చంద్రుగొండ మండలం**

## ధరణితో రైతుల బాధలు పోయాయి



ధరణితో రైతుల భూవివాదాలు, బాధలు పూర్తిగా పోయాయి. ధరణి వచ్చిన తర్వాతనే దళారుల బెడద పూర్తిగా తప్పింది. గత పాలనలో ముందు పహాణి కావాలంటే పట్వారి కోసం వేయి కండ్లతో ఎదురుచూడాల్సి వచ్చేది. ఆ పని కూడా.. లంచం ఇస్తేనే అయ్యేది. ఇప్పుడు మీసేవా సెంటర్‌కు వెళ్లి ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లిస్తే ఐదు నిమిషాల్లో పట్టా పత్రం ఇస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే పాత రోజులే వస్తాయి. రైతులకు మేలు చేసిన బీఆర్ఎస్ వైపే రైతులు ఉన్నారు.

**– ఇర్ప నాగేశ్వరరావు, రైతు, గొల్లగూడెం గ్రామం, కరకగూడెం మండలం**

## కేసీఆర్‌ను గెలిపించి, ధరణిని కాపాడుకుంటాం



రైతుల భూములను రక్షించేందుకే ధరణి పోర్టల్‌ను సీఎం కేసీఆర్ తెచ్చారు. ఇది రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంది. రైతుకు తెలియకుండా అతని భూమిని మరొకరికి బదలాయించే అవకాశమే లేదు. రైతు అనుమతితో మాత్రమే అతని భూమి మరొకరి పేరుతో నమోదవుతుంది. ధరణిని తీసివేస్తే పట్టాదారుల భూములు ఆగమవుతాయి. భూసమస్యలు మళ్లీ తలెత్తుతాయి. దళారుల రాజ్యంతో రైతులకు సమస్యలు వస్తాయి. కాంగ్రెసోళ్ల భూమాత మాకొద్దు. కేసీఆర్‌కు ఓటు వేసి, ధరణిని కాపాడుకుంటాం.

**–పాయం నర్సింహారావు, రైతు, కూనవరం, మణుగూరు మండలం**

## రైతులను మోసగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నం



తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత వ్యవసాయ విద్యుత్తు ఇస్తున్నది. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రెండు పంటలు పుష్కలంగా పండించుకుంటున్నారు. కాంగ్రెస్ మాత్రం.. వ్యవసాయానికి మూడు గంటలే విద్యుత్ సరిపోతుందని అంటున్నది. అది కరెక్ట్ కాదు. వ్యవసాయానికి మూడు గంటలు విద్యుత్ ఏ కోశానా సరిపోదు. ఈ ఎన్నికల్లో రైతులను మోసగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. ఆ పార్టీకి రైతుల మద్దతు ఉండదు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి రైతుల మద్దతు ఉంటుంది.

**– ఎల్లు చంద్రయ్య, రైతు, పినపాక**

## కాంగ్రెస్ వస్తే రైతులు ఆగమవుతారు



రాష్ట్రంలో కాంగ్రెస్ వస్తే రైతులు ఆగమవుతారు. తాము అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో తీసుకెళ్లి పడేస్తామని కాంగ్రెస్ నాయకులంటున్నారు. రైతుల భూములు పోయి దగా పడతారు. ధరణి పోర్టల్ తీసేస్తే రైతులకు రైతుబంధు కూడా రాదు. కాంగ్రెస్ వస్తే రైతుల నడ్డి విరుగుతుంది. వారి పాలనలో ఆత్మహత్యలు చూశాం. పెట్టుబడి లేక అప్పులపాలయ్యాం. కరెంటు లేక విలవిల్లాడిన పరిస్థితిని ఎదుర్కొన్నాం. మా సారుకే ఓటు వేస్తాం. ఆయనను గెలిపిస్తేనే వ్యవసాయం, రైతులకు మనుగడ ఉంటుంది. రైతులందరూ ఒక్కసారి ఆలోచించి అన్నదాతకు అండగా ఉన్న కేసీఆర్‌ను గెలిపించుకోవాలి.

**– కుంజ రమణ, మొండితోగు పంచాయతీ, ఇల్లెందు మండలం**

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే



వ్యవసాయానికి ఉచిత కరెంటుతో పంటలను మంచిగా పండించుకుంటున్నాం. మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. అట్లయితే ఎకరం పొలం కూడా పారదు. బోరులో 10 హెచ్‌పీ మోటర్ వేస్తే నీళ్లు సరిగా రావు. బోరుకు ఉండే ఊటలు తగ్గి, నీళ్లు అయిపోయి మోటర్లు కాలిపోతాయి. కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. వ్యవసాయానికి మూడు గంటలు మాత్రమే కరెంట్ ఇస్తామంటే సరిపోదు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తే.. కష్టాలు కొని తెచుకున్నట్లే. రైతులను రాజు చేస్తున్నది సీఎం కేసీఆర్ సార్. మేమంతా బీఆర్ఎస్ పార్టీకే ఓట్లు వేస్తాం. కేసీఆర్ సార్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తాం.

**– షేక్ బాబా, రైతు, ఆళ్ళపల్లి గ్రామం, మండలం**

## రైతుల గురించి పట్టించుకున్నదే కేసీఆర్



రైతుల గురించి సీఎం కేసీఆర్ పట్టించుకున్నట్లు ఎవ్వరూ పట్టించుకోలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు పనిచేశారు.. రైతుల కష్టాలు తీర్చినవారే లేదు. రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచిత కరెంటు, భూముల భద్రత కోసం ధరణి వంటివి ఏర్పాటుచేసి కేసీఆర్ రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటున్నాడు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే ఇంకా ఎన్నో మంచి పథకాలు పెట్టి అటు రైతులను, ఇటు ప్రజల్ని ఆదుకుంటారు. ఆయన్ని మూడోసారి ముఖ్యమంత్రిని చేసి రుణం తీర్చుకుంటాం.

**–కొవ్వూరి వెంకట్రావు, రైతు, రైసుపేట, చర్ల**

## ధరణి పోర్టల్.. రైతులకు వరం



రైతుల కష్టాలను తీర్చేందుకు ధరణి పోర్టల్‌ను సీఎం కేసీఆర్ తీసుకొచ్చారు. ఇది రైతులకు వరంగా మారింది. అన్ని భూముల వివరాలను ఒకేచోట పొందుపరిచి, వాటి నిర్వహణను అధికారుల చేతుల్లో నుంచి తీసివేశారు. దీంతో, ప్రభుత్వ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే కష్టాలు పోయాయి. రైతులు వచ్చి వేలి ముద్ర వేస్తే గానీ భూమి పట్టా మార్పిడి జరగని పరిస్థితి తీసుకొచ్చిన కేసీఆర్‌కు రైతులు సంతోషంతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ధరణి పోర్టల్ ద్వారా రైతు బంధు, రైతు భీమా, పంట కొనుగోళ్లు వంటి ఇతర ప్రయోజనాలు కూడా రైతులకు కలిసొచ్చాయి. కాంగ్రెస్ హయాంలో అధికారులతో ఇబ్బందులు వచ్చేవి. డబ్బులిస్తే ఒకరి భూమి మరొకరి పేరు మీదకు మార్చేసేవారు. తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి తీసుకువచ్చి భూములకు భద్రత కల్పించారు. మేము కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకుంటాం.

**– పకీర్, రాజుపేట గ్రామం, మణుగూరు మండలం**

## ధరణితో రైతులకు మేలు



ధరణి పోర్టల్‌తో రైతులకు మేలు జరిగింది. గతంలో అధికారుల చుట్టూ తిరగలేక విసుగొచ్చేది. ఇప్పుడు భూమి కొనడం, అమ్మడం,ఇట్టే జరుగుతున్నది. పహాణీని ఆన్‌లైన్‌లో క్షణాల్లో తీసుకుంటున్నం. కాంగ్రెసోళ్ళు ధరణిని తీసేస్తామని అంటున్నారు. మళ్లీ పాత పద్ధతి వస్తే ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఎనుకటి లెక్క చేతితో రాసే పట్టాలయితే అవకతకలు జరిగి రైతులకు అన్యాయం జరుగుతది. ధరణి కొనసాగాలంటే.. కేసీఆర్ సీఎంగా ఉండాల్సిందే.

**– పూనెం కృష్ణ ,రామాంజిగూడెం గ్రామం, ఆళ్ళపల్లి మండలం**


## కాంగ్రెసోళ్లవి సొల్లు కబుర్లు



పొలాలకు కరెంటు ఇచ్చే విషయంలో సీఎం కేసీఆర్ మంచిగా ఆలోచించిండు. మాకు తక్కువ పొలాలు ఉన్నాయి. మాకు చిన్న మోటర్లు చాలు. సారు ఇచ్చే 24గంటల కరెంటుతో ఎటువంటి ఇబ్బంది లేకుండా అవసరమైనప్పుడు పొలాలకు నీరు పెట్టుకుంటున్నం. నెమ్మదిగా పొలాలు అన్నీ తడుస్తున్నాయి. కరెంటు ఉందని ఇష్టం వచ్చినట్టు వాడుకోం కదా. అవసరమైనంత వరకే వాడుకుంటాం. ఒకేసారి పెద్ద మోటర్‌తో నీరు పెట్టుకునే అవసరం లేదు. అదే కొద్దిగంటల కరెంటు ఇచ్చి పెద్ద మోటర్ల పెట్టుకోమనడం కాంగ్రెసోళ్లు చెప్పే మాటలు సొల్లు కబుర్లు. అవి ఎందుకూ పనికిరావు. రైతులకు పెద్ద మోటర్లు అవసరం లేదు.

**– సాధు, కోడిపుంజులవాగు, పాల్వంచ మండలం**

## మళ్లీ కరెంటు కోతలు భరించలేం



కాంగ్రెస్ హయాంలో కరెంటు కోతలతో బాధలు పడ్డాం. బావుల్లో నీరున్నా ఎకరం, రెండెకరాలు పారుడే కష్టంగా ఉండేది. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తున్నారు. నాణ్యమైన విద్యుత్‌తో రైతులు పంటలు పండించుకుంటున్నారు. 5 హెచ్‌పీ మోటర్‌తో వ్యవసాయం చేస్తున్నాం. కాంగ్రెస్ నాయకులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటున్నారు. ఇది సాధ్యం కాదు. ఖర్చు ఎక్కువ అవుతుంది. బోర్లు ఎండిపోయే పరిస్థితి వస్తుంది. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మూడు గంటలు కరెంటు ఇస్తే నీరు సరిపోక పంటలు ఎండిపోతాయి. కరెంటు కష్టాలు మళ్లీ మొదలవుతాయి. కేసీఆర్ సార్ అన్ని వర్గాల కోసం అభివృద్ధి పనులు చేశారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. అందుకే మళ్లీ కేసీఆర్ సార్‌ను గెలిపిస్తాం.

**– కోడి శ్రీను, రైతు, మణుగూరు మండలం**

## పట్వారీ వ్యవస్థ మళ్లీ రావొద్దు



గ్రామాల్లో పట్వారి వ్యవస్థ మళ్లీ రావొద్దు. గతంలో పహాణీల కోసం వీఆర్వోల చుట్టూ తిరిగేవాళ్లం. వాళ్లకు డబ్బులు ఇస్తేనే పహాణీలు ఇచ్చేవారు. భూమి ఒకరిపేరు మీద ఉంటే పహాణీలు మరొకరి పేరుమీద ఉంటాయి. రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగితిరిగి విసిగిపోయాం. సీఎం కేసీఆర్ తెలంగాణ వచ్చాక ధరణి పోర్టల్ తేవడంతో రైతుల భూములు భద్రంగా ఉన్నాయి. భూ సమస్యలు పరిష్కారమయ్యాయి. కాంగ్రెస్ నాయకులు పట్వారి వ్యవస్థను మళ్లీ తీసుకువస్తామని అంటున్నారు. వాళ్లు వస్తే రైతుల భూములు మాయంకావడం ఖాయం. రైతులకు మళ్లీ కష్టాలే. ధరణి ముద్దు.. భూమాత వద్దు.

**– వందవాసు రాము, రైతు, సీతారాంపురం, దుమ్ముగూడెం**